క్లుప్తంగా

ఫిట్‌నెస్ లేకపోతే స్కూల్ బస్సులు సీజ్



స్కూల్ బస్సు ఫిట్‌నెస్‌ను పరిశీలిస్తున్న ఎంవీఐ

పుంగనూరు: స్కూల్ బస్సులకు అవసరమైన రికార్డులు, ఫిట్‌నెస్ లేకపోతే సీజ్ చేస్తామని ఎంవీఐ సుప్రియ హెచ్చరించారు. శుక్రవారం ఆమె స్కూల్ బస్సులను నడిపి, ఫిట్‌నెస్ పరీక్షించారు. ఆమె మాట్లాడుతూ, పట్టణంలోని స్కూల్ బస్సుల యజమానులు తక్షణమే తమ బస్సులకు ఇన్సూరెన్స్, పర్మిట్, పొల్యూషన్ కంట్రోల్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలన్నారు. రికార్డులు లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామన్నారు.అలాగే డ్రైవర్లు లైసెన్సులు కలిగి ఉండాలని, సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ వాహనాలు నడపడం, మితిమీరిన వేగంతో వెళ్లడం, ఓవర్‌లోడ్‌తో పిల్లలకు ఇబ్బందులకు కలిగిస్తే సహించేది లేదన్నారు.

నేడు బైక్ వేలం

సదుం: ఓ కేసులో సీజ్ చేసిన మోటార్ సైకిల్‌ను పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సెబ్ అధికారుల ఆధ్వర్యంలో వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ షేక్ షావలి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

టెట్రా ప్యాకెట్లు స్వాధీనం

పలమనేరు: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న టెట్రా ప్యాకెట్లను శుక్రవారం గంగవరం మండలం నాలుగు రోడ్ల వద్ద శుక్రవారం సీజ్ చేసినట్లు సెబ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. అదే మండలానికి చెందిన నిందితుడు బెస్తగానిపల్లె వాసి మంజునాథ్(28)ను అరెస్ట్ చేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన ఎంవీఆర్ కళాశాల విద్యార్థులు



యశ్వంత్‌కుమార్, పూజిత

గంగవరం: ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసిన మొదటి సెమిస్టర్ ఫలితాల్లో ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు కరస్పాండెంట్ వెంకటరమణారెడ్డి శుక్రవారం తెలిపారు. బీబీఏలో యశ్వంత్‌కుమార్(9.75), లయ(9.55), హిమబిందు(9.50), బీకాం(సీఏ)లో పూజిత(9.60), నజీర(9.50), సుల్తాన(9.40), బీబీఏలో మానిక(9.0), హారతి(9.0), బీఎస్సీలో మేనక(8.50) జీపీఏ పాయింట్లు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపల్ లక్ష్మీసుధ, అధ్యాపకులు అభినందించారు.

అన్న క్యాంటీన్లు ప్రారంభం



అల్పాహారం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీఓ

పలమనేరు: స్థానిక బస్టాండు వద్ద అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఆర్డీఓ మనోజ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డితో కలిసి ప్రారంభించారు. లాంఛనంగా అల్పాహారం పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. తాము గత ఏడాదిన్నరకాలంలో పట్టణంలో దాతల సాయంతో అన్న క్యాంటీన్‌ను నిర్వహించామని, ఇప్పుడు మళ్లీ దీనిని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. దాతలు కూడా మునుపటిలా సహకరించాలని కోరారు. పెద్దపంజాణి మాజీ జెడ్పీటీసీ చెంగారెడ్డి రూ.20వేల చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. తొలిరోజు భోజన దాతలుగా గిరి, ఖాజా వ్యవహరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: స్థానిక ఎంబీటీ రోడ్డులోని ట్రావెలర్స్ బంగ్లాలో శుక్రవారం అన్న క్యాంటీన్‌ను తెలుగుదేశం నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి, వెంకట్రమణరాజు ప్రారంభించారు. ప్రజలకు రూ.5 లకే భోజనాన్ని పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు సివి.రెడ్డి, గిరి, మాధవరెడ్డి, సుబ్రమణ్యంరాజు, సుహేల్‌బాషా, సద్దామ్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పం: స్థానిక రాధాకృష్ణరోడ్డును శుక్రవారం అన్న క్యాంటీన్‌ను కడా పీడీ వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. ఐదు రూపాయల ధరతో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెట్టనున్నట్లు చెప్పారు. పూటకు 400 మందికి చొప్పున రోజుకు 1200 మంది వీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుల పీఎస్ మునిరత్నం, పీ మనోహర్, రాజ్‌కుమార్, సత్యేంద్ర శేఖర్, డాక్టర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

పూల ధరలకు రెక్కలు!



పలమనేరు సమీపంలో సాగవుతున్న బంతి

శ్రావణమాసం ప్రారంభమైనప్పటి నుంచి స్థానికంగా పూల ధరలకు రెక్కలొచ్చాయి. రోజు రోజుకూ పెరుగుతూ శుక్రవారం వరలక్ష్మి వ్రతం నాటికి మరింతగా పెరిగాయి. ఓ వైపు వివాహాలు, శ్రావణవాస పూజలతో ధరల పెరుగుదలకు కారణమైంది. పూజలకు పూలు తప్పనిసరి కావడంతో ధరలెలా ఉన్నా ప్రజలు కొనక తప్పలేదు.

- శ్రావణ మాసం ప్రారంభం నుంచే పెరుగుతున్న ధర
- వరలక్ష్మి పండగతో అధిక ధరలకు అమ్మకాలు
- రైతుల వద్ద తక్కువకు కొని మార్కెట్‌లో మాత్రం ఎక్కువ



పలమనేరులోని ఓ పూల దుకాణం

పలమనేరు: పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లోని వీ.కోట, శాంతిపురం, రామకుప్పం, కుప్పం, బైరెడ్డిపల్లె, గంగవరం మండలాల్లో ఏటా పూలను సీజన్ బట్టి సాగు చేస్తుంటారు. ఏటా సాధారణ పూలసాగు 400 ఎకరాలుగా ఉంది. ఈ పర్యాయం 310 ఎకరాల్లో పూలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో బంతిలో విష్ణు, అష్టగంధ, అశోక, బిగ్‌బాల్ ఆరెంజ్, ఎల్లో బంతి పూలు, చామంతిలో పేపర్ ఎల్లో, పేపర్ వైట్ రకాలను ఎక్కువగా సాగు చేశారు. ఇవన్నీ ఈస్ట్‌వెస్ట్ కంపెనీ కొత్తగా ఉత్పత్తి చేసిన హైబ్రిడ్ రకాలు కావడంతో పంట ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తోంది. అయితే ఇటీవల వర్షాల కారణంగా పూల నాణ్యత తగ్గింది. ప్రస్తుతం ఇక్కడి ప్రధాన పూల మార్కెట్లైన కుప్పం, వీ.కోట, పలమనేరులకు అన్ని రకాల పూలు కలిపి రోజుకు ఐదు టన్నుల వరకూ వస్తున్నాయి .జిల్లాలోనే పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో పూల తోటలు ఎక్కువగా ఉన్నాయి.

పలమనేరులో పూల ధరలిలా...

స్థానిక పూల మార్కెట్‌లో గుండుమల్లి కిలో రూ.800 నుంచి రూ.900 దాకా ఉంది. సన్నమల్లి రూ.600, కనకాంబరాలు రూ.1000, చామంతి రూ.250 దాకా పలుకుతున్నాయి. ఇవి గురువారం భారీగా పెరిగి శుక్రవారానికి కాస్త తగ్గాయి. శ్రావణ మాసానికి ముందు ఉన్న ధరలు ఇప్పుడు రెట్టింపు కావడం గమనార్హం. ఇక, ఇక్కడ ఎక్కువగా సాగయ్యే పలు రకాల బంతి, చామంతుల ధరలు రైతు వద్ద కిలో రూ.100 నుంచి 140 దాకా ఉండగా అదే వ్యాపారుల వద్ద కిలో రూ.200 నుంచి రూ.240 దాకా విక్రయిస్తున్నారు. ఇలాంటి చోటే ధరలిలా ఉంటే మిగిలిన ప్రాంతాల్లో మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. పూల ధరలెలా ఉన్నా సాగు చేసే రైతు వద్ద తక్కువ ధరలకు దళారులు పూలను కొనుగోలు చేసి ఆపై మరింత లాభానికి పూల వ్యాపారులకు విక్రయిస్తున్నారు. పూలు సాగు చేసిన రైతుల కంటే దళారులు, వ్యాపారులే లాభాలు చవిచూస్తుండగా, రైతులకు మాత్రం తక్కువ ధరలే ఉండడం గమనించతగ్గ అంశం.

వివిధ ప్రాంతాలకు ఎగుమతి



నేను ఎక్కువగా బంతి, చామంతి, రోజాలాంటి కొత్త వంగడాల పూలను ఐదేళ్లుగా సీజన్ బట్టి సాగు చేస్తున్నా. ఈ ప్రాంతం నుంచి కర్ణాటకలోని బెంగళూరు, తమిళనాడులోని చెన్నై, మన రాష్ట్రంలోని విజయవాడ, తెలంగాణాలోని హైదరాబాద్‌కు ఎక్కువగా పూలను ఎగుమతి చేస్తున్నారు. దీనికితోడు బయటి రాష్ట్రాల వ్యాపారులు వీ.కోట, కుప్పం, శాంతిపురం, పుంగనూరు, పలమనేరు మార్కెట్లలో పూలను పెద్ద ఎత్తున కొనుగోలు చేసి ఆపై వ్యాపారులకు విక్రయిస్తారు. తోట వద్ద రైతు అమ్మే పూలే మళ్లీ మార్కెట్‌లో అమ్మే సమయానికి ధరలో వ్యత్యాసం ఉంటుంది.

–శివ, పూల రైతు, చీలంపల్లె

మనం అమ్మితే తక్కువ.. వాళ్ళు అమ్మితే ఎక్కువ



నేను గుండుమల్లి ఇక్కడి మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముతుంటా. మావద్ద వ్యాపారి కిలో గుండుమల్లి రూ.400 తీస్తే వాటినే రూ.800 అమ్ముతున్నారు. కేవలం గంటల వ్యవధిలో ధరలు డబుల్ అయిపోయాయి. దళారులు, రైతుల పని మేలుగా ఉంది. పూల సాగు చేసే రైతులు మాత్రం ధరల విషయంలో నష్టపోతూనే ఉన్నారు. వ్యాపారులదే ఇష్టారాజ్యంగా మారింది.

–ఉమాపతి, ముసలిమొడుగు, పలమనేరు మండలం

ఘనంగా ముత్యాలమ్మ ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

రొంపిచెర్ల: రొంపిచెర్లలో ముత్యాలమ్మ అమ్మవారిని శుక్రవారం రాత్రి మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. వరలక్ష్మీవ్రతం పురస్కరించుకుని అమ్మవారికి ఆలయ అర్చకులు గుణ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఉభయదారులుగా పాత కురవపల్లెకు చెందిన కోట వెంకటరమణ దంపతులు వ్యవహరించారు.

'కుప్పంలో రేపు వైద్యుల నిరసన'

కుప్పం: కోల్‌కత్తా ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో వైద్యురాలి దారుణ హత్యాచారం ఉదంతాన్ని ఖండిస్తూ జరిగిన ఆదివారం కుప్పం పరిధిలోని ఆస్పత్రుల్లో ఓపీ (ఔట్ పేషెంట్) వైద్య సేవలు నిలిపివేసి నిరసన వ్యక్తం చేయనున్నట్లు కుప్పం మెడికలఅసోసియేషన్ అధ్యక్షుడు మంజునాథ్ తెలిపారు. కేవలం అత్యవసర వైద్య సేవలు మాత్రమే ఉంటాయని, ఉదయం 6 నుంచి సాయంకాలం 6 గంటల వరకు ఓపీ సేవలు నిలుపుదల చేస్తున్నట్టు చెప్పారు. దీనికి డాక్టర్లు సహకరించాలని ఆయన కోరారు.

అయ్యప్ప సేవకు పెద్దిరెడ్డి

తిరుపతి మంగళం: అయ్యప్పస్వామి దీక్షలో ఉన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మొక్కు చెల్లించుకునేందుకు శుక్రవారం శబరిమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా తిరుపతి మారుతీనగర్‌లోని పెద్దిరెడ్డి నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి కట్టుకున్నారు. అనంతరం రైలులో శబరిమలైకు బయలుదేరి వెళ్లారు. పూజలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇంటి నుంచి బయలుదేరుతున్న పెద్దిరెడ్డి



ఇరుముడి కట్టుకుంటున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

వేతనాలు మహాప్రభో..!

- ఏరియా ఆస్పత్రి వద్ద కార్మికుల ఆందోళన
- కూటమి అధికారంలోకి వచ్చాక రాజకీయ వేధింపులు



నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

పలమనేరు: తమకు ఐదునెలలుగా ఇవ్వని వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికులు ఆందోళన చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొచ్చే తమకు వేతనాలను పెండింగ్‌లో పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తగినంత సిబ్బంది లేకున్నా తామే అన్ని పనులూ చేస్తున్నామన్నారు. అనంతరం తమ డిమాండ్లపై ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ శారదకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిధర్ గుప్తా, లోకేష్, విజయమ్మ, రామక్రిష్ణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

క్వారీ రికార్డు చూపించు జనార్ధనా..!

- వైఎస్సార్ సీపీ నాయకుల డిమాండ్

పలమనేరు: మండలంలోని మాదిగబండ క్వారీకి సంబంధించి జనార్ధన్ నాయుడే లీజుదారుడైతే మైనింగ్‌శాఖ నుంచి ఆయనకున్న రికార్డులు చూపించాలని వైఎస్సార్‌సీపీ నేతలు బాలాజీనాయుడు, ప్రహ్లాద తదితరులు డిమాండ్ చేశారు. అవి కాకుండా వేరేవన్నీ చూపెడితే ప్రయోజనం లేదన్నారు. శుక్రవారం వారు పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఆయనే నిజమైన యజమాని అయితే మైనింగ్‌శాఖలో, ట్రాన్స్‌కోలో కరెంట్ కనెక్షన్ ఇత్యాది వాటిల్లో ఆయన పేరు ఎందుకు లేదని ప్రశ్నించారు. గతంలో ఆయన క్వారీలో వాటాన్ని వీ.కోట మండలానికి చెందిన శరత్‌కుమార్‌కు విక్రయించలేదని, రూ.కోటి దాకా మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ బంధువుల నుంచి తీసుకోలేదని కాణిపాకానికి వచ్చి ప్రమాణం చేస్తారా? అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నిరసన



చిత్తూరు కార్పొరేషన్: కొల్‌కత్తాలో పీజీ డాక్టర్ దారుణ హత్యాచారం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి చిత్తూరులో విద్యార్థులతో కలిసి కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నిషిధ, చిట్టిబాబు, రామభద్ర తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఉరుసు

చిత్తూరు రూరల్: నగరంలోని దర్గాలో శుక్రవారం ఉరుసును వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. ఇందులో భాగంగా ముస్లింలు వందలాదిగా తరలివచ్చారు. వారి రాకతో దర్గా కిక్కిరిసింది. రాత్రి అన్నదానం చేశారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఈ వేడుకల్లో పాల్గొని, దర్గాను దర్శించుకున్నారు.

నేడు ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యసేవలు బంద్

పలమనేరు: కోల్‌కత్తాలో వైద్యురాలి హత్యాచారం ఉదంతాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనల నేపథ్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యసేవలు పూర్తిగా బంద్ చేస్తున్నట్లు పలమనేరు ఐఎంఏ శాఖ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ యుగంధర్, డాక్టర్ మల్లికార్జునరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో ఆందోళన చేయనున్నట్టు తెలియజేశారు. అంతేకాకుండా కోల్‌కత్తాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య విద్యార్థులపై రౌడీమూకలు దాడులు చేయడం చూస్తే అక్కడ మహిళలకు భద్రత ఏపాటిదో, పోలీస్ వ్యవస్థ ఎంత చేతకానితనంతో వ్యవహరిస్తోందో తెలుస్తోందన్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే..!



వీ.కోట: వ్రతమాచరిస్తున్న భక్తులు



పలమనేరు: సత్యగంగమ్మ ఆలయంలో కరెన్సీ నోట్ల అలంకరణతో అమ్మవారు



పలమనేరు: ఇళ్లలో వరలక్షిని కొలువుదీర్చి..,



వీ.కోట: ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరిదేవి

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం
- పలుచోట్ల పూజలు
- కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణ

పలమనేరు: పట్టణంలో వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. శుక్రవారం లక్ష్మీదేవికి ఇష్టమైన రోజు కావడంతో ప్రజలు తమ ఇళ్లలో వరలక్ష్మిని కొలువుదీర్చి, రకరకాల అలంకరణలు చేసి, పూజలు చేశారు. సత్యగంగమ్మ ఆలయంలో నిర్వాహకులు మీనాక్షి రూ.10లక్షల కరెన్సీనోట్లతో అమ్మవారిని అలంకరించారు. ఇక్కడికి పెద్దసంఖ్యలో మహిళలు పూజలు చేశారు. స్థానిక ఆలయాలలో ప్రత్యేక పూజలు చేసి మహిళలకు పసుపు, కుంకుమను అందజేశారు. పండుగ సందర్భంగా పట్టణంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

గంగవరంలో..

గంగవరం: మండలంలో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. మహిళలు తమ ఇళ్లలోని కలశాలతో అమ్మవారి ప్రతిమను కొలువుదీర్చి, నూతన వస్త్రాలతో విశేషంగా అలంకరించారు. అమ్మవారిని పూజించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ముత్తయిదువులు తమ సౌభాగ్యం పదిలంగా ఉండాలని తోటి ముత్తయిదువులను ఇళ్లకు ఆహ్వానించి వాయినాలు సమర్పించి వ్రతాన్ని పూర్తి చేశారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలవ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిప్రపత్తులతో ఆచరించారు.ఇళ్లలో కలశం, అమ్మవారి ప్రతిమలు పెట్టి పలు రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. సకల సౌభాగ్యాలు ప్రసాదించమని కోరుతూ ఉపవాస దీక్షలతో ప్రత్యేక పూజలు చేశారు. పిండి వంటలను లక్ష్మీదేవికి నైవేద్యంగా సమర్పించారు. ఇరుగు పొరుగు ముత్తైదువులను పిలిచి వాయనాలు, తాంబూలాలు, పసుపు, కుంకుమ ఇచ్చి వారి ఆశీస్సులు పొందారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలోని మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సకల సౌభాగ్యాలు ప్రసాదించాలని కోరుతూ వ్రత పూజలు చేశారు. వివిధ రకాల పుష్పాలు, అరటి, చెరకు, మామిడి తోరణాలతో అందంగా అలంకరించిన మండపంపై వరలక్ష్మీ మాతను కొలువుదీర్చారు. మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వీ.కోటలో..

వి.కోట: స్థానిక వాసవీమాత ఆలయంలో శ్రీ కన్యకాపరమేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో మహిళలు దీపారాధన చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు వారి ఇళ్లలో వరలక్ష్మీదేవి విగ్రహాలను ఉంచి, పూజలు చేసి, ముత్తైదువులకు గాజులు, పసుపు,కుంకుమ ఇచ్చిపుచ్చుకున్నారు. అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని పలు దేవాలయాలు, ఇళ్లలో శ్రావణ శుక్రవార పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవార్లను వివిధ రూపాలలో అలంకరించారు., పూజలు చేసి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పట్టణంలోని శ్రీవిరూపాక్షి మారెమ్మను కరెన్సీ నోట్లతో అలంకరించారు. అలాగే శ్రీభోగనంజుండేశ్వస్వామి ఆలయంలో పార్వతిదేవిని, శ్రీకళ్యాణ వెంకట్రమణస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండల వ్యాప్తంగా మహిళలు తమ ఇళ్లలో సాంప్రదాయబద్ధంగా వరలక్ష్మివ్రత పూజలు చేశారు. ముత్తైదువులకు వాయనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.





పెద్దపంజాణిలో వరలక్ష్మి అమ్మవారు, పుంగనూరు: కరెన్సీ నోట్ల అలంకరణతో విరూపాక్షి మారెమ్మ

కుప్పంలో..



ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

కుప్పం: వరలక్ష్మీ వ్రత పూజలు పట్టణంలో మహిళలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటా వ్రతమాచరించారు. ఇరుగు పొరుగు మహిళలను ఆహ్వానించి పసుపు, కుంకుమ, సారె అందజేశారు. అలాగే పట్టణంలోని అన్ని దేవాలయాల్లో అమ్మవారి ప్రతిమలను కొలువుదీర్చి పూజలు చేశారు. కుప్పం ఎంఎఫ్‌సీ ప్రభుత్వం జూనియర్ కళాశాల ప్రాంగణంలో సాయిమాత సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రత పూజలను వేద పండితులు బాలసుబ్రమణ్యస్వామి భక్తులతో చేయించారు. వ్రతం ప్రాముఖ్యతను వివరించారు.



పుంగనూరు: ప్రజల ఇళ్లలో..